

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## విప్రలబ్ధ

**"నిన్న** గుప్పెడు మనసు సీరియల్ చూసి ఎంత ఏడ్చానంటే, మా వారు ఆఫీస్‌నుంచి వచ్చి నా మొహం చూసి హడిలిపోయారు." ఇరుగమ్మ పొరుగమ్మతో చెప్తోంది. ఇల్లాళ్ళు అపార్ట్‌మెంట్స్‌లోని మెట్లమీద కూర్చుని సాయంత్రాలు కబుర్లతో కాలక్షేపం చేస్తూంటారు. సాధారణంగా లిఫ్ట్ తప్పించి మెట్లు ఎక్కి పైకి వచ్చేవాళ్ళు తక్కువ కాబట్టి అందరూ కరెంట్ తీగ మీద వాలిన పక్షుల్లా ఆ మెట్లమీద సర్దుకు కూర్చుని కబుర్లు చెప్పుకుంటూంటారు.

డ్రాయింగ్ రూంలో పిల్లల్ని చదివిస్తున్న కావేరి ఆ మాటలు వినగానే ఆలోచనలో పడింది. తను ఏడ్చి ఎంతకాలమైంది?

గుర్తు తెచ్చుకుందామని ప్రయత్నించింది కానీ గుర్తురాలేదు. ఇదివరకు సినిమాలో విషాద సన్నివేశాలు చూస్తే చాలు కళ్ళు వాచేలా ఏడ్చేది. మరి ఇప్పుడు తనకి ఏడుపు ఎందుకు రావడంలేదు?

చేతిలోని పుస్తకాన్ని పక్కన పెట్టి మళ్ళీ ఆలోచించింది.

ఆరేళ్ళక్రితం, ఓ చిన్నపిల్లవాడిమీద వీధికుక్కలు దాడి చేసి పీక్కుతిన్నాయన్న వార్త చదివి రెండురోజులపాటు ఏడ్చింది. ఆ పసికందు ఎంతభయపడి ఉంటాడు, ఎంతబాధపడి ఉంటాడు, ఆ తల్లికెంత కడుపుకోత అని తెరలు తెరలుగా ఏడ్చింది. అంత ఘోరమైన చావు రావడానికి ఆ ఐదేళ్ళ పసికందు ఏం పాపం చేసాడని దేవుడ్ని తిట్టి మళ్ళీ ఏడ్చింది.

అంతే. ఆ తర్వాత తను ఏడవలేదు. తన అప్పగింతల్లో ఏడవలేదు. మూడేళ్ళ క్రితం నాయనమ్మ పోయినప్పుడు ఏడవలేదు. రెండుసార్లు ప్రసవ వేదన పడింది. కానీ ఏడ్వలేదు.

ఎందుకు తనలో ఇంత నిర్లిప్తత? ఆమెకి జవాబు తట్టలేదు.

ఆ రాత్రి భోజనం చేస్తూ కూర ఉప్పుమయంగా ఉండటంతో పక్కకి తోస్తూ భర్త కంచంవైపు చూసింది. విపుల్ కూడా కూరని పక్కకి నెట్టి సాంబార్‌తో తింటున్నాడు.

"సారీ. నాకు మరీ పరధ్యానం ఎక్కువైంది. కూరలో ముక్కలకంటే ఉప్పే ఎక్కువ" సంజాయిషీగా చెప్పింది.

"పర్లేదు మూడువందల అరవైరోజులు వంట చేసేప్పుడు ఒకోసారి ఎక్కువ తక్కువ పడుతూంటుంది. సాంబార్ బావుంది" రెండోసారి వడ్డించుకుంటూ చెప్పాడు విపుల్.

'ఎంత మంచివాడు!' కృతజ్ఞతగా చూసింది.

వంటిల్లు సర్ది పడకగదిలోకి వెళ్ళేసరికి విపుల్ మంచం మీద పడుకుని టివి చూస్తున్నాడు. కావేరిని చూడగానే టివి ఆఫ్ చేసి రిమోట్ పక్కన పెట్టి చెప్పాడు.

"ఇవాళ ఒక విచిత్రం జరిగింది?"

"ఏమిటి?" నిరాసక్తంగా అడిగింది.

"ఆఫీస్ పనిమీద మా బెంగుళూర్ బ్రాంచ్‌నించి కొంతమంది ఆఫీసర్లు వచ్చారని చెప్పాకదా. అందులో ఒకతను మీ ఊరివాడే నిరంజన్."

కావేరి ఉలిక్కిపడింది. నిరంజన్. ఆ పేరు పూర్వజన్మలో విన్నట్లుగా ఉంది.

'ఐ లవ్‌యూ కావేరీ' గుసగుసగా చెప్పే యువకుడి ఆకారం కళ్ళముందు కదలాడింది.

"లంచ్ టైంలో పక్కపక్కనే కూర్చున్నాం. మాటల్లో మీ ఊరివాడే అని తెలిసింది. 'మా కావేరి వాళ్ళది కూడా అదే ఊరు' అని చెప్పాను. అతను మీ ఇంటి పేరు చెప్పి 'ఆ కావేరేనా?' అని అడిగాడు. అవునని చెప్పాను."

కావేరి యాంత్రికంగా వింటోంది. మనసు మనసులో లేదు.

"నిరంజన్ కొద్దిసేపాగి చెప్పాడు 'మీకు చెప్పచ్చో చెప్పకూడదో తెలీదు మిస్టర్ విపుల్. నేను కావేరిని పెళ్ళి చేసుకుందామనుకున్నాను."

కావేరి నిటారుగా కూర్చుంది. ఆమె మొహంలో ఆశ్చర్యం.

"నేనూ ఆశ్చర్యపోయాననుకో. నా భార్యగురించి నాకు చెప్తున్నాడు ఇతనికేమైనా పిచ్చా అనుకున్నాను. కానీ అతను చాలా నిజాయితీగా ఆ విషయం చెప్పాడు.

"నేను కావేరిని బాగా ఇష్టపడ్డాను. ఆమె చాలామంచిది. ఆ మంచితనాన్ని ప్రేమించాను. ఆమె నెమ్మదితనాన్ని ప్రేమించాను. అంతా అందాన్ని చూసి ప్రేమిస్తారు. కానీ కావేరిలోని మంచితనానికి అందం బోనస్ అంతే! మా పరీక్షలయ్యాక నేను వాళ్ళింటికి వెళ్ళాను. ఆ వయసులో కుర్రాళ్ళ మనస్థత్వమే నాది కూడా. మనకి కావాల్సిన దాన్ని పొందాలంటే నిజాయితీ, నిబద్ధత మాత్రమే ముఖ్యం, అదే వాళ్ళకి నచ్చి నన్ను అల్లుడిగా ఒప్పుకుంటారు అనుకున్నాను. ఓ సాయంత్రం వాళ్ళింటికెళ్ళాను. కావేరి ఫ్రెండ్ ఇంటికి వెళ్ళిందని చెప్పారు. నేను తనని పెళ్ళిచేసుకుంటానని చెప్పాను. అంతే వాళ్ళ అమ్మ, నాయనమ్మా తిట్లు లంకించుకున్నారు. వాళ్ళ నాన్నయితే బూతులు తిట్టి, కొట్టడానికి మీద మీదకి వచ్చాడు, 'ఎంత ధైర్యంరా నీకు' అంటూ. ఇంత సంస్కారంలేని వాళ్ళకి కావేరిలాంటి నమ్రత కలిగిన అమ్మాయి ఎలా పుట్టిందా అనుకున్నాను. నాకు వాళ్ళమీద అసహ్యం వేసింది. మారుమాట్లాడకుండా వెళ్ళిపోయాను. ఆ రాత్రే మా ఊరు వదిలి సిటీకి వెళ్ళిపోయాను. కావేరి మాత్రం మంచి అమ్మాయండీ. బంగారు తల్లి. మీరు పువ్వుల్లో పెట్టి చూసుకోవాలి" చెప్పాడు.

"నేను అలాగే చూసుకుంటున్నానండీ 'నా ఏడుమల్లెల ఎత్తు రాకుమారిని' అని చెప్పాను మనింటికి రమ్మన్నా కాని రానని వెళ్ళిపోయాడు."

విపుల్ ఆప్యాయంగా భార్య భుజం చుట్టూ చేతిని వేసాడు. కావేరి మొహంలో ఏ భావం కనపడనీయలేదు. తల్లితండ్రులు తనతో ఆ మాట చెప్పలేదు. రహస్యంగా ఉంచారు.

విపుల్ పావుగంటలో గాఢ నిద్రపోయాడు. కావేరికి నిద్రపట్టలేదు. నెమ్మదిగా లేచి బాల్కనీలోకి వచ్చి బెడ్‌రూం తలుపు మూసింది. ఆ హేమంతరాత్రి గాలి చల్లగా వీస్తోంది. చంద్రుడు కాంతివంతంగా ఉన్నాడు. విపుల్ ముచ్చటపడి పాకించిన తీగకున్న జాజిపూలు విచ్చుకుని నక్షత్రాల్లా సుతారంగా కదలాడుతున్నాయి.

కావేరి కుర్చీలో కూలబడింది. ఆమెకి తనకెందుకు ఏడుపు రావడంలేదో అర్థమైంది. తనని ప్రాణం కన్నా అధికంగా ప్రేమించానని చెప్పిన ప్రియుడు, తనని అపురూపంగా చూసుకున్న స్నేహితుడు నిరంజన్ గుర్తొచ్చాడు.

"కావేరీ. మీ ఇంటికి వస్తాను. మీ అమ్మా నాన్నలని ఒప్పిస్తాను. నిన్ను పెళ్ళిచేసుకుంటాను." చెవిలో గుసగుసగా చెప్పినప్పుడు తన చెంపలని తాకిన అతని వేడి శ్వాస గుర్తొచ్చింది.

మూడేళ్ళు ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన ప్రియుడు వస్తాడని, తల్లితండ్రులతో మాట్లాడి తనని పెళ్ళిచేసుకుంటాడని ఎదురు చూసి చూసి నిశ్శబ్దంగా ఏడ్చి తన కన్నీళ్ళు ఇంకిపోయాయి. అవమానం, పరాభవం తన గుండెని రాయిలా చేసాయి. కబుర్లు తప్ప అతనికి నిజమైన ప్రేమలేదని తను మోసపోయానన్న భావన కఠినురాల్ని చేసింది. ముఖ్యంగా ఆ తిరస్కారం భరించశక్యం కానిది. భీష్ముడి తిరస్కారానికి ఎంత బాధపడితే అంబ, అలా ఆడ మగ కాని జన్మని ఎత్తడానికి అంగీకరిస్తుంది?

అదే తిరస్కరణ భావన తన దుఃఖాన్ని ఘనీభవింపచేసింది.

కానీ నిరంజన్ తనని తిరస్కరించలేదు. తనవాళ్ళ స్పందన నచ్చక, వాళ్ళకి నచ్చచెప్పలేననే నిరాశతో వెళ్ళిపోయాడు. ఆ విషయం తనకి చెపితే బాధపడుతుందని, తన వాళ్ళతో గొడవ పడుతుందని తెలిసి నిశ్శబ్దంగా తన జీవితంలోంచి వెళ్ళిపోయాడు. తను తనవాళ్ళవల్ల ప్రేమికుడ్ని పోగొట్టుకుంది. కానీ నిరంజన్ తనని మోసం చేయలేదు. ఆమెలో దుఃఖం తన్నుకు వచ్చింది. ఆ శీతల హేమంత రాత్రి కావేరి కుమిలి కుమిలి ఏడుస్తోంది. పొంగి పొర్లి ఏడుస్తోంది.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments